దారిద్ర్యం వదులుతోంది..!
కూటమి సర్కార్ రాకతో రోడ్ల పనులకు గ్రీన్‌సిగ్నల్
ఉమ్మడి జిల్లాలో జోరుగా రహదారుల పనులు 4



పుడమికి.. పండగ..!



ఆయకట్టులో దుక్కిదున్నుతున్న రైతు

- రెండేళ్ల తర్వాత నిండిన గొట్లూరు చెరువు
- సాగులోకి ఆయకట్టు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- ముమ్మరంగా వరినాట్లు
- అన్నదాతల ఆనందం



తొణికిసలాడుతున్న చెరువు..
తూముల నుంచి వస్తున్న నీరు..
తడిపేస్తుంటే..
ఎద్దులతో దుక్కి దున్నుతుంటే..
రైతులు గెనాలు సరిచేస్తుంటే..
మహిళలు వరినాట్లు వేస్తుంటే..
ఆయకట్టు పసరిక పరచుకుంటోంది..
పుడమి తల్లికి పండగొచ్చింది..

ధర్మవరంరూరల్, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు చెరువు పూర్తిగా నిండిపోయింది. ఆయకట్టులో పంటలు సాగవుతున్నాయి. దీంతో పచ్చని పసరికను పరుచుకుంటూ పుడమి పులకించిపోతోంది. రెండేళ్ల తర్వాత ఖరీఫ్‌లో కురిసిన వర్షాలకు గొట్లూరు చెరువు నిండి మరువ పారింది. రైతులు చెరువు కింద ఉన్న ఆయకట్టును సాగులోకి తెచ్చారు. రబీ సాగుకు వరినాట్లు వేస్తున్నారు. చెరువు కింద 540 ఎకరాల ఆయకట్టు ఉండగా.. 695 మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి ఎకరాలో పంట పెడుతుండడం హర్షణీయం.



వరినాట్లు వేస్తున్న మహిళాకూలీలు

రెండేళ్ల తర్వాత సాగులోకి...

గొట్లూరుచెరువు కింద ఆయకట్టు భూమి రెండేళ్ల తర్వాత సాగులోకి వచ్చింది. ఎన్నడూలేనివిధంగా ఈసారి అధికమంది రైతులు భూమి సాగు చేసుకుంటున్నారు. చెరువు నుంచి తూముల ద్వారా సకాలంలో నీరు విడుదల చేయడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఆయకట్టు భూమి సాగులోకి రావడంతో రైతుల మొహంలో ఆనందం కనిపిస్తోంది.

కూలీలకు పెరిగిన డిమాండ్

ఆయకట్టు భూమి సాగులోకి రావడంతో కూలీలకు డిమాండ్ వీపరీతంగా పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు. వరినాట్లు వేసేందుకు మహిళా కూలీలు దొరకట్లేదంటున్నారు. రోజుకు రూ.500 నుంచి 600 వరకు చెల్లిస్తున్నారు. కూలీలు దొరక్క బడన్నపల్లి, నాగలూరు, బత్తలపల్లి తదితర గ్రామాల నుంచి తీసుకొచ్చి, పనులు చేయించుకుంటున్నారు. ట్రాక్టర్ బాడుగలు సైతం విపరీతంగా పెంచేసినట్లు రైతులు చెబుతున్నారు.

ఆనందంగా ఉంది



చెరువులో నీరు పుష్కలంగా ఉంది. రెండేళ్ల తర్వాత ఆయకట్టుకు నీరు వదలడంతో పంటలు సాగుచేసుకుంటున్నాం. ఆనందంగా ఉంది. పెట్టుబడి పెట్టినా పంట చేతికొస్తుందన్న నమ్మకం ఉంది.

-లక్ష్మీనారాయణ, ఆయకట్టు రైతు

బాడుగలు, కూలీల రేట్లు పెరిగాయి



ఆయకట్టు రైతులంతా పంట సాగుచేసుకోవడంతో కూలీలు రేట్లు, ట్రాక్టర్ల బాడుగలు రేట్లు వీపరీతంగా పెరిగిపోయాయి. పక్కగ్రామాలకు వెళ్లి కూలీలను తోలుకొచ్చి, పనులు చేయించుకుంటున్నాం. నీరు పుష్కలంగా రావడంతో సాగుపై ఆసక్తి పెరిగింది. ఎకరా భూమిని సాగు చేసుకుంటున్నా.

-నరసింహులు, ఆయకట్టు రైతు

పటిష్ట నిఘాతో నేరాలు తగ్గుముఖం

- గతేడాదితో పోలిస్తే 31.9 శాతం తగ్గుదల
- మహిళల భద్రతకు పెద్దపీట: ఎస్పీ రత్న
- 2024 వార్షిక నేర నివేదిక విడుదల



వార్షిక నేర నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ రత్న, ఏఎస్పీ, డీఎస్పీలు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పటిష్ఠ నిఘా, ముందస్తు చర్యలతో ఈఏడాది నేరాలు తగ్గాయని ఎస్పీ రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2024కి సంబంధించిన పోలీసు వార్షిక నివేదికను సోమవారం ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈసారి 31.9 శాతం నేరాలు తగ్గాయన్నారు. పోలీసుల సమష్టి కృషి, అంకితభావంతో పనిచేయడం కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు.

- పేకాట, మట్కాపై ఉక్కుపాదం మోపి, 627 కేసులు నమోదుచేయడంతో పాటు 2757 మందిని అరెస్టు చేశామన్నారు.
- గంజాయి స్థావరాలపై డ్రోన్ల సాయంతో దాడులు చేసి, 13 కేసులు నమోదు చేసి, 36 మందిని అరెస్టు చేశామన్నారు. మొత్తం 24.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.
- మద్యం అక్రమ రవాణాకు సంబంధించి 1118 కేసులు నమోదు చేసి, 1161 మందిని అరెస్టు చేశామన్నారు.
- ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులు గతేడాది 107 నమోదుకాగా.. ఈసారి 102 నమోదయ్యాయన్నారు.
- పదేపదే నేరాలకు పాల్పడుతున్న నలుగురిపై పీడీయాక్టు ప్రయోగించి, వివిధ నేరాలకు పాల్పడుతున్న 126 మందిపై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేశామన్నారు.
- గతేడాది 544 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. ఈసారి 550 జరిగాయన్నారు.
- లోక్ అదాలత్ ద్వారా 3119 కేసులకు పరిష్కారం చూపగలిగామన్నారు.
- సెల్‌ఫోన్ల చోరీకి సంబంధించి 667 ఫిర్యాదులు రాగా.. రూ.80.25 లక్షల విలువైన 580 ఫోన్లను రికవరీ చేసి, ఫిర్యాదుదారులకు అందజేశామన్నారు.

అర్జీదారులను గౌరవించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారుల వద్దకొచ్చే అర్జీదారులను గౌరవించి, వారి పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 228 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యయప్రసాలకు ఓర్చి అధికారుల వద్దకు వస్తుంటారన్నారు. వారిపట్ల అధికారులు సానుభూతితో వ్యవహరించాలన్నారు. ప్రతి అర్జీదారుడికి పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

డీపీఓలో 19 ఫిర్యాదులు

పుట్టపర్తి రూరల్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 19 ఫిర్యాదులు అందాయి. వాటిని ఎస్పీ రత్న స్వీకరించి, బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులను పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీని మంగళవారం వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్.. యంత్రాంగాన్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 2,64,629 మంది లబ్ధిదారులకు రూ.114.46 కోట్లు పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు తెలిపారు. 1వ తేదీ ఆంగ్ల సంవత్సరాది కావడంతో ఒకరోజు ముందే పింఛన్లు అందజేస్తున్నామన్నారు. వందశాతం పింఛన్ల పంపిణీకి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం పింఛన్ తీసుకోకుంటే 2వ తేదీన పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారథి, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఉన్నారు.

టీడీపీ కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

పుట్టపర్తి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం ఏర్పాటుకు అనువైన భూములను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డె అంజినప్ప సోమవారం పరిశీలించారు. పుట్టపర్తి, ఎనుములపల్లి బైపాస్ రోడ్డు పక్కన పలుచోట్ల భూములను పరిశీలించారు. అనువైన భూములపై ఆర్డీఓ సువర్ణతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఆరాతీశారు. ప్రధాన రహదారుల్లో అనువైన భూమిని సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

బడి పిల్లల భద్రత కోసం..

- జిల్లాలో వినూత్న ప్రయోగానికి నిర్ణయం
- పాఠశాల బస్సులకు రివర్స్ కెమెరాలు
- ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు
- చర్యలకు ఉపక్రమించిన అధికారులు



పాఠశాల బస్సుకు అమర్చిన బ్యాక్ కెమెరా

హిందూపురం అర్బన్ డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు.. తమ పిల్లలు బాగా చదువుకోవాలని ఫీజులు కట్టి మరీ.. ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. ఇంటి నుంచి బస్సు ఎక్కి పంపుతారు. సాయంత్రం ఎప్పుడవుతుందా.. బిడ్డ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తారు. బిడ్డ రాక కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. బడి బస్సులో వస్తుందనుకున్న బిడ్డ అదే బస్సు కింద నలిగిపోయిందని తెలియగానే ఆ తల్లిదండ్రుల గుండెలు పగిలి, కన్నీటి ధార ఉబికొస్తుంది. ఆ బాధ మాటల్లో వర్ణించలేనిది. జీవితాంతం మరువలేనిది. బడి బస్సును రివర్స్ చేసే సమయంలో వాటి చక్కాల కింద పడి పసివాళ్లయిన విద్యార్థులు చనిపోతుంటారు. జిల్లాలో కూడా అలాంటి ప్రమాదాలు గతంలో జరిగాయి. అలాంటి వాటికి చెక్‌పెట్టేలా చర్యలు చేపడుతున్నారు. పాఠశాల బస్సులు రివర్స్ చేసుకునేటపుడు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు బడి బస్సుల్లో రివర్స్ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ నిర్ణయించారు. ఇటీవల కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని వెలువరించారు. పాఠశాల బస్సులకు యాజమాన్యాలు బ్యాక్ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రవాణా, విద్యాశాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. కార్లలో రివర్స్ కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటారు. రివర్స్ చేసేటపుడు వెనుకవైపున ఏముందో వాటిలో స్పష్టంగా తెలిసిపోతుంది. దీంతో ప్రమాదాలను నివారించగలుగుతున్నారు. అదే తరహాలో పాఠశాల బస్సులకు సైతం రివర్స్ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది కార్యరూపం దాల్చితే జిల్లాలోనే తొలిసారిగా బడి బస్సులకు రివర్స్ కెమెరాలు బిగించినట్లవుతుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు.

ప్రమాదాలను అరికట్టవచ్చు



బడి బస్సులకు తొలిసారిగా జిల్లాలోనే రివర్స్ కెమెరాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది మంచి ఫలితాలు ఇస్తుంది. తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చు.

- కరుణసాగర్ రెడ్డి, ఆర్టీఓ, హిందూపురం

ఉమ్మడి జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇలా...

- కూటమి ప్రభుత్వం ఆర్అండ్బీ రోడ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధులు - రూ.44.29 కోట్లు
- గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు: రూ. 75 కోట్లు
- విపత్తుల సమయంలో రోడ్ల మరమ్మతులకు గత సర్కార్ రూ. 139 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ. 8.26 కోట్లు ఇచ్చింది.

పీఆర్ పరంగా...

- కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారులకు మంజూరు చేసిన నిధులు : రూ. 203 కోట్లు
- గత టీడీపీ హయాంలో పీఆర్లోని పీఐయూ విభాగంగా పరంగా 2018-19లో కేంద్రం సహకారంతో రూ. 268 కోట్లు విడుదల చేసింది.
- గత ఐదేళ్ల వ్యవధిలో గ్రామీణ రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 316 కోట్లు.
- విపత్తుల సమయంలో రూ. 77 కోట్లు పెడితే రూ. 45 కోట్లు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల నుంచి విడుదల చేసి మమ అనిపించింది.





తాడిపత్రి నుంచి బుక్కాపురం వెళ్లే ఆర్అండ్బీ రహదారి వేయక ముందు.. వేసిన తరువాత..

పనులకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఎస్డీఆర్ఎఫ్ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.44.29 కోట్లతో 253 పనులు 3438.36 కిలోమీటర్ల మేర చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్బీలో చేసిన అరకొర పనులకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్లో పెట్టారు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం గత సర్కార్ మాదిరిగా కక్ష సాధింపునకు దిగకుండా పెండింగ్ బిల్లులపై ఆరా తీయడంతో బాధిత కాంట్రాక్టర్లలో కొత్త ఆశలు రేకెత్తాయి. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా కొన్ని బ్రిడ్జిల పనులకు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది.

పీఆర్ పరంగా...

ఉమ్మడి జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రామీణ రహదారులను గత వైసీపీ సర్కార్ ఐదేళ్లలో పట్టించుకోలేదు. తద్వారా పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల పాలనలో రెండు సార్లు మాత్రమే నిధులు మంజూరు చేశారు. అంతకు మించి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల వ్యవధిలోనే అనంతపురం జిల్లాకు రూ. 100 కోట్లు, శ్రీ సత్య సాయి జిల్లాకు రూ. 103 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాల అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం పెరిగింది.

2024 కొత్త వెలుగులు 5

దారిద్ర్యం వదులుతోంది..!

కూటమి సర్కారు రాకతో రోడ్ల పనులకు గ్రీన్సిగ్నల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా రహదారుల పనులు
కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
వైసీపీ పాలనలో ఛిద్రమైన రోడ్లు
అరకొర పనులకు బిల్లుల చెల్లింపులోనూ జాప్యమే



పీఆర్లో పల్లెపండుగలో భాగంగా అనంతపురం శివారు రాజీవ్కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రంలో జరుగుతున్న రోడ్డు పనులు

వైసీపీ పాలనలో రోడ్లపై ప్రయాణం దుర్భరంగా ఉండేది. ఐదేళ్లలో ఒక్క కొత్త రోడ్డు వేయకపోగా ఉన్న రోడ్లకు సైతం మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్లపై గుంతలు ఏర్పడి గోతులుగా మారాయి. వీటిపై ప్రయాణించడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. గుంతల రోడ్లపై ప్రయాణంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది గాయపడ్డారు. కొందరు మృతి చెందారు. అయినా అప్పటి ప్రభుత్వంలో రోడ్లను బాగు చేయాలన్న స్పృహ ఏమాత్రం కానరాలేదు. ఏదో అక్కడక్కడ తూతూ మంత్రంగా రోడ్లను సరి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి పాడైపోయిన రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే పీఆర్, ఆర్అండ్బీ రోడ్లను బాగు చేయడానికి కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బీటీ, సీసీ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఐదేళ్ల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే తొలగిస్తోందని వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల గురించి కూటమి ప్రభుత్వం ఆరా తీయడంతో కాంట్రాక్టర్లు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రోడ్లతో సందడి

కూటమి ప్రభుత్వం ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఉమ్మడి జిల్లాలో కొత్త రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం మరమ్మతులు, రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరు చేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పెండింగ్ బిల్లులపై ఆరా తీసి, నిధులన్నీ ఖర్చు చేసి ఆయా రోడ్లను సైతం వచ్చే సంక్రాంతిలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. కూటమి సర్కార్ రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ చూపిస్తుండటంతో అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

అనంతపురం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లు ఛిద్రమయ్యాయి. రోడ్ల అభివృద్ధి గురించి గానీ కనీసం మరమ్మతుల గురించి గానీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చే నిధులను సైతం గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని (పీఆర్, ఆర్అండ్బీ, జాతీయ రహదారుల శాఖలకు చెందిన) రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆరునెలల కిందట కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్ల పనుల సందడి మొదలైంది. ప్రధానంగా పీఆర్ పరంగా చూస్తే.. పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ. 203 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్ల పనులకు నిధులు మంజూరు ఆవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాంట్రాక్టర్లలో సందడి మొదలైంది.



ధర్మవరం పరిధిలో జరగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీరాములు

ప్రస్తుతం


- అనంతపురం జిల్లాలో ఆర్అండ్బీ పనుల పరిస్థితి.
- రోడ్ల పనుల సంఖ్య : 134
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1939.12
- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ. 27.76 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఆర్అండ్బీ పనుల పరిస్థితి..
- రోడ్ల పనుల సంఖ్య : 119
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1499.24

- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ.16.53 కోట్లు
- అనంతపురం జిల్లాలో పీఆర్ పనుల పరిస్థితి..
- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 100 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1818

శ్రీ సత్యసాయి జిల్లాలో...

- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 103 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1722

నాడు



మడకశిర నియోజకవర్గంలోని భక్తరహళ్లి రోడ్డు

నేడు



రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు




రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. రామ్నగర్లోని అనంతేశ్వర స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న హృత్వికొరెడ్డి రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. రాణ్యతార, విశ్రుత్, అవిరామ్, సహస్ర, కౌశిక్, విగ్నేష్, యోగినాథ్, ప్రతీష్రెడ్డి, చంద్రమోహన్రెడ్డిలు ఆయా విభాగాల్లో పతకాలు సాధించారు. కోచ్ కేదార్నాథ్తో పాటు విజేతలకు పలువురు అభినందనలు తెలిపారు.

కాంక్రీట్ పనులపై రైతుల్లో ఆందోళన

సీపీఐ నాయకుడు జగదీష్



ఇన్చార్జ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న జగదీష్

అనంతపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా రెండోదశ కాలువకు కాంక్రీట్ వేసే పనులపై రైతుల్లో ఆందోళన నెలకొందని, దీనిపై పునరాలోచించాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు జగదీష్ ఇన్చార్జ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్లో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదికలో రైతులు, రైతు సంఘాల నేతలతో కలిసి ఆయన ఇన్చార్జ్ కలెక్టరును కలిశారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలో కృష్ణాజలాలు ప్రవహిస్తుండటంవల్ల లక్షలాది ఎకరాలకు నీరు అందుతోందన్నారు. భూగర్భజలాలు పెరిగి బోరుబావులు రీచార్జ్ అవుతుండటంతో రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. ఇపుడు కాలువకు ఇరువైపుల, అడుగు భాతంలో కాంక్రీట్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. దీనివల్ల భూగర్భజలాలు పెరగక బోరు బావులు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అందుకే ఈకాంక్రీట్ పనులపై తొలుత రైతులు, రైతుసంఘాల నేతలు, అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

నియామకం

అనంతపురం ప్రెస్క్లబ్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 30: ఎస్సీ కార్పొరేషన్ ఇన్చార్జ్ ఈడీగా ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఇన్చార్జ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న సారయ్య అవినీతి, అక్రమాల నేపథ్యంలో సస్పెండ్ అయిన విషయం విదితమే. దీంతో ఆయన స్థానంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణకు ఇన్చార్జ్ ఈడీ బాధ్యతలు అప్పగించారు. నేడో రేపో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చంద్రబాబుతోనే నదుల అనుసంధానం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం/రాయదుర్గం, డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన నదులను అనుసంధానించడం చంద్రబాబుకే సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకొని రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు తపిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగానే గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం జరగబోతోందన్నారు. ఎప్పటి నుంచో ప్రతిపాదనల్లోనే ఉండిపోయిన నదుల అనుసంధాన ప్రక్రియ సీఎం చంద్రబాబు చొరవతో కార్యరూపం దాల్చబోతుండటం హర్షణీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద తన ప్రత్యేక పలుకుబడిని విశాల ప్రజాప్రయోజనాలకు ఉపయోగిస్తున్న తీరు రాష్ట్ర భవిష్యత్తుపై చంద్రబాబుకున్న బాధ్యతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. సీమ జిల్లాల్లో ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే సీఎం ఆలోచనకు నిదర్శనమే ఈ నదుల అనుసంధానమన్నారు. వరద సమయంలో గోదావరి నుంచి రోజుకు రెండు మూడు టీఎంసీల నీటిని మళ్లించడం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. సుమారు రూ.80 వేల కోట్ల వ్యయంతో చేపట్టబోయే ప్రాజెక్టును రాబోయే మూడు నెలల్లో ప్రారంభానికి ప్రయత్నిస్తుండటం ప్రశంసనీయమన్నారు. గోదావరి జలాలతో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరందించడం సాధ్యపడుతుందన్నారు. పోలవరం ద్వారా కృష్ణా నదికి గోదావరి జలాలు మళ్లించడంతో పాటు అక్కడి నుంచి బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్కు నీరు మళ్లిస్తారని చంద్రబాబు చెప్పారన్నారు. తద్వారా 345 టీఎంసీల నీరు ఉపయోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను సీమ జిల్లాలకు ఎక్కువ శాతం ఉపయోగించే వీలు కల్పించే ఈ బృహత్తర పథకంతో సీమ భవిష్యత్తు పూర్తిగా మారిపోతుందన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని కాలవ అన్నారు.

సొంతిల్లు కలే..!

జగనన్న కాలనీల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

గోడలు, పునాదులకే పరిమితం
బిల్లులు అందక ఆపేసిన లబ్ధిదారులు
కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



రేగాటిపల్లి సమీపాన జగనన్నకాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ధర్మవరం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగనన్న కాలనీల పేరుతో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అర్థంతరంగా ఆగిపోయాయి. పునాదులు, గోడలకే పరిమితమయ్యాయి. నిర్మాణ వ్యయం బాగా పెరిగిపోవడం, కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు ఆగిపోయినట్లు సమాచారం. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రభుత్వం అందించే రూ.1.8లక్షల సాయం ఎంత మాత్రం సరిపడలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం పట్టణ, మండల పరిధిలోని రేగాటిపల్లి, గొట్లూరు, పోతులనాగేపల్లి, కుణుతూరు, గొల్లపల్లి వంక సమీపాల్లో జగనన్న కాలనీ పేరుతో పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపజేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు సకాలంలో అందకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఆర్థిక స్తోమతలేక నిర్మాణాలు ఆపేశారు. ఇళ్లు కట్టుకోకపోతే పట్టాలు రద్దు అవుతాయోమోనన్న ఆందోళనతో కొందరు డబ్బులు ఉన్నకాటికి కట్టించుకోని వదిలేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి, సొంతింటి కలను నేరవేర్చాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయంటే..?

ధర్మవరం పట్టణ సమీపంలో ఉన్న పోతులనాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి, గొల్లపల్లి వంక, గొట్లూరు గ్రామాల్లో ఇంటి పట్టాతో పాటు ఇళ్లనిర్మాణాలను మంజూరు చేశారు. కుణుతూరు వద్ద 100కు పైగా, గొల్లపల్లి వంక వద్ద 1351, పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్లో 4500, రేగాటిపల్లి పొలంలో 1000కి పైగా, గొట్లూరు వద్ద 100మందికి పైగా ఇంటిపట్టాతో పాటు ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కో ప్రాంతంలో కూడా సగానికి పైగా నిర్మాణాలు చేపట్టలేదు.

వసతుల కొరత

జగనన్న కాలనీలో వసతులు లేక లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తున్నారు. ప్రధానంగా కుణుతూరు, గొట్లూరు, గొల్లపల్లి, రేగాటిపల్లి సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్లలో సరైన వసతులు లేక పునాదులకే పరిమితవ ఎయ్యాయి. కాలనీల్లో ఎక్కడా కూడా నీటి వసతి కల్పించలేదు. తూతుమంత్రంగా ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి కాలనీల్లో దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో లబ్ధిదారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకోని కొంతవరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో ఒక్కో ట్యాంకర్ ధర రూ.500నుంచి రూ.700వరకు ఉండటంతో లబ్ధిదారులు అంత ధర చెల్లించకలేక ఇల్లు కట్టుకోవడానికి ముందుకు రాలేదు. కాలనీల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదని, నీటి వసతి తోపాటు విద్యుత్సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక, సిమెంట్ పక్కదారి..?

ఇళ్ల నిర్మాణాలకు అప్పట్లో ప్రభుత్వం ఇసుక, సిమెంట్ను సరఫరా చేసింది. అయితే వీటిని పేదలకు అందించకుండా కొంతమంది అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు, ఇంజనీర్ అసిస్టెంట్లు పేదలకు ఇవ్వాల్సిన ఇసుక కూపన్లు, సిమెంట్ బస్తాలను అమ్ముకున్నట్లు తెలుస్తోంది. సగం ఇళ్లకే పూర్తిస్థాయిలో ఇసుక, సిమెంట్ ఇచ్చినట్లు నమోదు చేసి మిగిలిన వాటిని బ్లాక్ మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు ఆయా లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో అప్పటి సిమెంట్ లేదని ఇంకా ఈ ప్రభుత్వం మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో బిల్లులు అందిస్తాం

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తాం. గత పదేళ్ల నుంచి నిలిచిపోయిన ఇళ్లకు నిర్మాణాలు చేపట్టగానే విడతలవారీగా బిల్లులు లబ్ధిదారుల అకౌంట్లోకి జమ అవుతున్నాయి. బిల్లుల విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.

\- శంకర్లాల్, హౌసింగ్ డీఈఈ, ధర్మవరం



గొల్లపల్లి వంక సమీపంలోని జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన ఇళ్లు

పింఛన్లకు రూ.124.86కోట్లు

అనంతపురం క్లాక్టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ను జనవరి నెలకు సంబంధించి మంగళవారం గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయనున్నారు. జిల్లాలో 2,84,085మంది పింఛన్దారులకు రూ.124.86కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,39,472మందికి రూ.56.10 కోట్లు, వితంతువులు 66,354మందికి రూ. 26.77కోట్లు, చేనేతలు 6,588 మందికి రూ.2.64కోట్లు, కల్లుగీత కార్మికులు 351 మందికి రూ.14.2లక్షలు, మత్స్యకారులు 876మందికి రూ.35.లక్షలు, ఒంటరి మహిళలు 6,687మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మచారులు 3,464మందికి రూ. 1.39కోట్లు, హిజ్రాలు 205మందికి రూ.84 వేలు, హెచ్ఐవీ బాధితులు 2,432 మందికి రూ.97లక్షలు, డప్పు కళాకారులు 3,089మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 178మందికి రూ.72వేలు, దివ్యాంగులు 45,820మందికి రూ.27.63కోట్లు, కుష్టు బాధితులు 381మందికి రూ.22లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,425మందికి రూ.2,13కోట్లు, ప్రమాద బాధితులు 1074మందికి రూ.1.61కోట్లు, అభయహస్తం 4,186మందికి రూ.21లక్షలు మొత్తం 2,84,085మందికి రూ.124.86కోట్లు నిధులు విడుదల చేశారు. పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి సిబ్బంది సోమవారమే డ్రా చేసుకున్నారని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఆర్డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మొదటి రోజే పింఛన్దారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారని, సాంకేతిక కారణాలతో సమస్యలు వస్తే రెండో రోజు పూర్తి చేస్తారని తెలిపారు.

చీనీ టన్ను రూ. 27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27,420 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్కు సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 5, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

చిరుత మృతి


చిరుత కళేబరం

బ్రహ్మసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ తోటలో సుమారు ఐదేళ్ల వయ సున్న చిరుతపులి మృతి చెందింది. గ్రామస్థుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండల పశువైద్యాధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో చిరుతపులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత మృతి చెంది మూడు నాలుగు రోజులై ఉంటుందని పశువైద్యాధికారి తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే చిరుత మృతికి గల కారణాలు తెలు స్తాయన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల జూదం.. ఆరుగురి అరెస్టు

కదిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పూల బజార్ లోని బెస్తవీధిలోని ఇంట్లో సోమవారం పేకాట ఆడుతున్న దంపతులు, ఐదుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పేకాటపై రాబడిన సమాచారం మేరకు ఎస్ఐ బాబ్‌జాన్.. సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారన్నారు. జూదం కేసులో మహిళలు ఆరెస్టు కావడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

కుటాగుళ్ల శివార్లలో..: మున్సిపాలిటీ పరిధి కుటాగుళ్ల శివార్లలో జూదం ఆడుతున్న 11 మందిని ఆరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.8,470 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


సందీప్(ఫైల్)

కూడేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు సందీప్ (35) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సందీప్ తమమ తోటలో ఉన్న కొబ్బరి చెట్టు పట్టలు తగిలి తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజులు ఎగిరిపోతుండటంతో సోమవారం సాయంత్రం వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలోనే చెట్టు ఎక్కి పట్ట కొడుతున్న సమయంలో వాటికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందకి పడ్డాడు. పక్కనే ఉన్న మరో వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న రైతుల పరుగున అక్కడికి వచ్చారు. తీవ్రంగా గాయపడిన సందీప్‌ను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సందీప్ తనకున్న మూడున్నర ఎకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

టెండర్లలో గందరగోళం

- పాత వారికే కట్టబెట్టే ప్రయత్నం?
- సమగ్రశిక్ష ఏపీసీని నిలదీసిన టెండర్‌దారులు
- కలెక్టరేట్‌లో హైడ్రామా ● నేటికి వాయిదా



సమగ్రశిక్ష ఏపీసీని నిలదీస్తున్న టెండర్‌దారులు

పుట్టపర్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు తదితర వసతి గృహాలకు సరుకుల సరఫరా టెండర్ల ప్రక్రియ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గందరగోళంగా సాగింది. గత వైసీపీ పాలనలో సరఫరా చేసిన వారికే మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ పలువురు టెండర్‌దారులు.. సమగ్రశిక్ష అతనపు ప్రాజెక్టు సమన్వయకర్త (ఏపీసీ) సంపూర్ణను నిలదీశారు. దీనిపై రాత్రి పొద్దుపోయేదాకా కలెక్టరేట్‌లో హైడ్రామా నడిచింది. జిల్లాలోని వసతి గృహాలకు సరుకులు, చికెన్, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాల సరఫరాకు ఈనెల 21న టెండర్లు పిలిచారు. సోమవారం మధ్యాహ్నందాకా బుక్కపట్నంలోని సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో టెండర్లు స్వీకరించారు. సాయంత్రం సీల్డ్ టెండర్లను కలెక్టరేట్‌లో తెరిచారు. టెండర్లలో 16 మందిదాకా పాల్గొన్నారు. అనుభవం తదితర సాకులు చూపుతూ గతంలో సరఫరా చేసిన వారికే మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారని పలువురు టెండర్‌దారులు ఆరోపించారు. టెండర్లలో తాము తక్కువకు కోట్ చేసినా సాకులు చూపుతూ పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. పాత వారికి ఎలా కట్టబెడతారంటూ టెండర్లలో పాల్గొనేందుకు వచ్చిన హిందూపురానికి చెందిన టీడీపీ నాయకులతోపాటు పలువురు టెండర్‌దారులు.. సమగ్రశిక్ష ఏపీసీ సంపూర్ణను నిలదీశారు. అనర్హులకు కట్టబెట్టాలని చూస్తే కలెక్టరేట్‌లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సాయంత్రం మొదలైన టెండర్ల రభస రాత్రి పొద్దుపోయే కొనసాగుతూనే ఉంది. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కలుగజేసుకుని టెండర్లను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతగత వారికి ఇస్తామని చెప్పడంతో టెండర్లుదాఖలు శాంతించారు. గందరగోళం నడుమ టెండర్ల ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేశారు.

నిమ్మ ధరలు.. పతనం..!

- ఇతర జిల్లాల నుంచి తాడిపత్రికి నిమ్మకాయలు
- రెండు నెలల క్రితం రూ.4వేలు పలికిన ధర
- ప్రస్తుతం రూ.500 నుంచి 1500..

గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన


నిమ్మ బస్తాలు

తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిమ్మధరలు భారీగా పడిపోయాయి. రైతులకు కనీసం గిట్టుబాటు కావడం లేదు. ఇలాగే ఉంటే అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఎదురవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, యాడికి, పెద్దపప్పూరు, నార్పల మండలాల్లో ఎక్కువగా సాగుచేశారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు బస్తా రూ.3500 నుంచి 4వేల వరకు ఉండేదని, రెండునెలల నుంచి దారుణంగా పడిపోయిందని రైతులు చెబుతున్నారు. సంచి రూ.30, ఆటో బాడుగ రూ.50, కూలీ రూ.300 ఇలా.. ఒక బస్తాకు దాదాపు రూ. 400 ఖర్చు అవుతుంటే.. మార్కెట్‌లో రూ. 500 నుంచి రూ.1500 పలుకుతోంది. నాసిరకం కాయలయితే రూ. 200 నుంచి రూ. 300 పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం కూలీలకు పెట్టిన ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి కూడా రాకపోతే అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మరో రెండునెలలు ఇలాగే ఉంటుందని వ్యాపారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు ఇతర ప్రాంతాల కూడా నుంచి కూడా కాయలు వస్తుండడంతో ధరలు మరింత పడిపోయాయి. అనంతపురంతోపాటు ఇతర ప్రాంతాల మార్కెట్లకు తీసుకువెళదామంటే అక్కడ మరింత తక్కువ ధరలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. నెల్లూరు, కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి నిమ్మకాయలు తాడిపత్రి మండీలకు వస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారు 3వేల బస్తాలు గుజరాత్, పూణె, షోలాపూర్, కేరళ, తిరుచ్చి, మధురై, మైసూర్, బళ్లారి, హోస్పేట్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నిమ్మకాయల ధరలు తగ్గడానికి చలికాలమే ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఊరగాయకు తప్ప మిగతా వాటికి తక్కువ మోతాదులో వాడకం ఉంటుందని, అందువల్ల ధరలు తక్కువగా ఉంటాయని అంటున్నారు. దిగుబడి ఎక్కువగా రావడం కూడా మరో కారణంగా చెబుతున్నారు.

కూలి డబ్బులు కూడా రాలేదు



నాకున్న ఒకటిన్నర ఎకరాల పొలంలో నిమ్మచెట్లు సాగుచేశాను. దిగుబడి వచ్చినా.. ధర లేకపోవడంతో కూలీ డబ్బులు కూడా రావడం లేదు. పండిన పంటను ఏదో విధంగా మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకోవాలని కష్టపడుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. గిట్టుబాటు అయినా, కాకపోయినా కాయలను మాత్రం మార్కెట్‌కు తరలించక తప్పదు.

- సూర్యనారాయణరెడ్డి, నాయకునిపల్లి, పుట్లూరు మండలం.

తాడిపత్రిలోనే మంచి ధర



ప్రతి సంవత్సరం నిమ్మకాయల ధరలు 8నెలలు బాగా పలుకుతాయి. నాలుగు నెలలు తగ్గుతుంటాయి. కానీ ఈ ఏడాది 10 నెలలు ధర బాగా పలికింది. రెండునెలలుగా ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాయలసీమలోనే తాడిపత్రిలో అత్యధికంగా ధర పలుకుతుండడంతో.. అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప, నంద్యాల, ప్రకాశం, నెల్లూరు, పొదిలి, చీమకుర్తి తదితర ప్రాంతాల వారు ఇక్కడికి తీసుకువస్తున్నారు. ఇక్కడి నుంచి గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాం.

- శేఖర్, మండీ వ్యాపారి

నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం..!

- నిరుపయోగంగా డంపింగ్ యార్డు
- పట్టించుకోని అధికారులు


గొర్రెలకు నిలయంగా చిక్కేపల్లి చెత్త సంపద తయారీ కేంద్రం

యాడికి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇదేదో గొర్రెల పెంపక కేంద్రం అనుకుంటున్నారా... బోర్డును పరిశీలిస్తే ఇది చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అని అర్థమవుతుంది. అధికారుల నిర్లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎలా నిరుపయోగంగా మారుతున్నాయో చెప్పడానికి నిదర్శనం ఈ చిత్రం. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి ప్రభుత్వం వీటిని నిర్మించింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిరుపయోగంగా మారాయి. యాడికి మండలం చిక్కేపల్లిలో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. ప్రారంభంలో కొంతకాలం నిర్వహించారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గొప్పల కోసం వీటికి రంగులు మార్చారు. గ్రామాల్లో చెత్త సేకరణ మాత్రం జరగలేదు. గొర్రెల కాపరులు వీటిని ఇలా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా తయారీ కేంద్రాల లక్ష్యం నెరవేరేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డీఆర్ఎం సీఎస్ గుప్తా హాజరు


డీఆర్ఎం సీఎస్ గుప్తాను సన్మానించిన ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డివిజనల్ రైల్వే మేనేజరుగా నియమితులైన సీఎస్ గుప్తా సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో హాజరయ్యారు. ఇక్కడ మేనేజరుగా పనిచేస్తున్న విజయకుమార్ స్థానంలో బెంగళూరు మెట్రో రైల్ సర్వీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరుగా విధులు నిర్వర్తిస్తున్న సీఎస్ గుప్తాను నియమిస్తూ 26వ తేదీన రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించిన సంగతి విదితమే. ఈ మేరకు గుప్తా గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయానికి వచ్చి రిపోర్టుచేశారు. అయితే డీఆర్ఎం విజయకుమార్ నుంచి సోమవారం చార్జ్ తీసుకోలేదు. త్వరలో ఈయన చార్జ్ తీసుకుని, విధుల్లో చేరనున్నారు. డీఆర్ఎం కార్యాలయానికి వచ్చిన గుప్తాకు ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు ఆహ్వానం పలికి, ఘనంగా సన్మానించారు.

కందిపోతున్న రైతులు

- భారీగా పడిపోయిన ధర
- గిట్టుబాటు ధర కోసం అన్నదాతల ఎదురుచూపు


మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కందులు

ఉరవకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధరలు లేక కంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటా రూ.12వేల దాకా ధర ఉండటంతో ఉరవకొండ ప్రాంతంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో అధికంగా కంది పంటను సాగు చేశారు. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో సుమారుగా 27,334 ఎకరాలలో కంది పంటను సాగు చేశారు. వజ్రకరూరులో 13,845ఎకరాలు, ఉరవకొండలో 6,036ఎకరాలు, విడపనకల్లు 7,453 ఎకరాల్లోను జూలై, ఆగస్టు నెలల్లో కంది పంటను సాగు చేశారు. ఇటీవల వరుస తుఫాన్‌ల కారణంగా కంది పంట దెబ్బతిని, ఎకరాకు 2 క్వింటాళ్లు దిగుబడి తగ్గినట్లు రైతులు తెలిపారు. ఇప్పుడు పంటను కోసి, నూర్పిడి చేసి కందులను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయితే ధర సగానికి తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు దాదాపు రూ.30వేల దాకా పెట్టుబడి పెట్టామని, దిగుబడి కూడా 5 నుంచి 6క్వింటాళ్ల దాకా వచ్చిందని, ధర తగ్గిపోవడంతో నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ధర లేకపోవడతో ఉరవకొండప్రాంత రైతులు కందులను రాయచూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడ మార్కెట్‌లో కూడా రూ.8వేలకు మించి క్వింటా అమ్ముడుపోవడం లేదని, వెనక్కు తీసుకురాలేక అక్కడే దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మాత్రం రేటు గిట్టుబాటు కాదని సరుకును వెనక్కు తెచ్చి కల్లాల్లోనే ఆరబోసుకుంటున్నారు. నూర్పిడి చేసిన పంటను పొలాల్లోనే రాశులు పోసుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కందులను కొనుగోలు చేయాలి. రెండున్నర ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ఎకరాకు 5నుంచి7 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. వ్యాపారులు ధరలు అమాంతం తగ్గించారు. గత ఏడాది రూ.9వేల దాకా ధర పలికింది. ప్రస్తుతం రూ.6వేల నుంచి రూ.7వేల వరకే అడుగుతున్నారు. **- అశోక్, రైతు ఉరవకొండ**

వ్యాపారులు చెప్పిన రేటుకే..



ఆరు ఎకరాలలో కంది పంట సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా ఉంది. అమ్ముదామంటే కొనే వారు లేక పంటను రాశులు పోసుకుని ఉండాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఎకరాకు 2క్వింటాళ్ల దాకా దిగుబడి తగ్గింది. రాయచూర్ మార్కెట్‌లో రూ.6వేలకు మించి ధర పలకడం లేదు.

- తిప్పయ్య, రైతు ఉరవకొండ

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

జనవరిలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఈ క్రాప్ చేయించుకున్న రైతులందరూ ఆర్బీకేలలో కొనుగోళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మార్కెట్ ధర ప్రకారమే కొంటాం. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్లు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కోరారు.

- పెన్నేశ్వరి, మార్క్ ఫెడ్ డీఎం

కంది కొనుగోలు వెంటనే ప్రారంభించాలి


మార్కెట్ యార్డులో కంది రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు మధుసూధన్, రంగారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన కందులను సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న హామీ ప్రకటనలకే పరిమితమైందన్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధరలు పతనమై, నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు చొరవ తీసుకుని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జ్ఞానమూర్తి, శీనప్ప, కౌలురైతు సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

3న సైన్స్ ఫెయిర్

అనంతపురం విద్య, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 3న ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని 8,9,10వ తరగతుల విద్యార్థులు తయారు చేసిన సైన్స్, గణితం ప్రాజెక్టు నమూనాలు ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్, జడ్పీ, సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల గణితం, సైన్స్ టీచర్లు తమ విద్యార్థులను గైడ్ చేసి మూడు ప్రాజెక్టులను ఈనెల 2నే మండలాల్లో జరిగే సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించేలా హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిని డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు జిల్లా సైన్స్ అధికారి పర్యవేక్షించాలని, 3న జిల్లా సైన్స్ ఫెయిర్ విజయవంతయ్యేలా చూడాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 19తులాల బంగారం, రూ.10.5 లక్షల అపహరణ

హిందూపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లోని భరత్ కుమార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భరత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఈనెల 28న బంధువుల ఊరైన కర్ణాటకలోని గుడిబండకు వెళ్లారు. వారు సోమవారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంట్లోకి వెళ్లిన అరగంట తరువాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లగా.. కిటికీ కడ్డీలు కత్తిరించి ఉండడాన్ని గమనించారు. అనుమానం వచ్చి మేడపైకి వెళ్లి బీరువా భద్రపరిచిన గదిని చూడగా.. తలుపులకున్న తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. బీరువాలోని 19 తులాల బంగారు ఆభరణాలు, రూ.10.5 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అబ్దుల్ కరీం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పుట్టపర్తి నుంచి క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. పగులగొట్టిన తాళం, కత్తిరించిన కిటికీ కడ్డీలను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

చింతలాంపల్లిలో ఘర్షణ

- ఇరువర్గాలవారికి గాయాలు

గుంతకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలాంపల్లిలో స్థలం, ఆలయ దారి విషయంలో టీడీపీ, వైసీపీకి చెందిన కురుబ కులస్థుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. టీడీపీ వర్గీయుల్లో కేశవ, మహేశ్, సరళమ్మ, వైసీపీ వర్గీయులలో కదిరప్ప, వన్నూరప్ప, మల్లికార్జున, రవి గాయపడ్డారు. వీరిని రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ జయవర్ధన్ రెడ్డి సూచించారు. ఈ ఘర్షణకు రాజకీయాలో సంబంధం లేకపోయినా పార్టీల పేరిట కొందరు ప్రచారం చేశారు. దీంతో వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు తరలివచ్చారు. రూరల్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలను నమోదు చేసుకున్నారు. గాయపడ్డవారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.


గాయపడ్డ కేశవ


మహేశ్


కదిరప్ప, వన్నూరప్ప


మల్లికార్జున

న్యూస్ బాక్స్..

వైసీపీ నాయకుడికి అందలం



వేదికపై కూర్చున్న వైసీపీ నాయకుడు

బత్తలపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ నాయకుడికి అధికారులు అందలం ఎక్కించారు. మండలంలోని కోడేకండ్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబుళాపురం పంచాయతీ సర్పంచ్ బండి సరస్వతితో పాటు ఆమె భర్త, వైసీపీ నాయకుడు బండి వీరనారప్పను వేదిక పైకి రావాలని స్వయానా అధికారులే ఆహ్వానించారు. అంతేకాకుండా తమతో పాటు ప్రముఖంగా కూర్చొబెట్టుకొని మరీ కార్యక్రమాన్ని నిర్వహించడం పలు విమర్శలకు తావిస్తోంది.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వీరాంజనేయులు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా ఇడగొట్టు వీరాంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆర్వో పులగంపల్లి నరసింహులు, ఆర్గానిక్ సెల్ కన్వీనర్ చింతా శరత్‌కుమార్‌రెడ్డి, బూదిలి సుదర్శన్ ఆధ్వర్యంలో స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఉత్తమకుమార్ రెడ్డి, తలుపుల గంగాధర్, మండల మాజీ అధ్యక్షుడు సున్నంపల్లి రంగారెడ్డి, మండల ఇన్‌చార్జి భాస్కర్‌నాయక్, సురేష్ ఇందులో పాల్గొన్నారు.

● కొత్తచెరువు: బీజేపీ మండల అధ్యక్షుడిగా పెద్దినేని గంగానాయుడును ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు జిల్లా కార్యవర్గసభ్యుడు సుదర్శన్‌నాయుడు, అసెంబ్లీ కో-కన్వీనర్ శేషాద్రి నాయుడ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విక్రమ్, రామానాయుడు, భాస్కర్ పాల్గొన్నారు.

గుండెపోటులో ఉప సర్పంచ్ మృతి



పార్వతమ్మ(ఫైల్)

నల్లచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. అగ్రహారం పంచాయతీ ఉపసర్పంచ్ వై. పార్వతమ్మ (65) సోమవారం గుండెపోటుతో మరణించారు. టీడీపీ మద్దతురాలుగా గెలిచి, ప్రస్తుతం ఉప సర్పంచ్‌గా విధులు నిర్వహించే వారు. ఆమె మృతదేహానికి గ్రామ స్థులు, నాయకులు పూలమాలలు వేసి, నివాళర్పించారు. పార్వతమ్మకు ఇద్దరు కుమారులున్నారు.

యువతకు క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక గుట్టకిందపల్లి వద్దగల ఆర్డీటీ క్రీడామైదానంలో సోమవారం యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం, ఆరోగ్యం లభిస్తాయ న్నారు. అనంతరం గెలుపొందిన యువతకు ట్రోఫీ, మెడల్స్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, యువ నాయకులు ముక్తం మనిదీప్, పీఈటీ రాజేశ్, అధ్యాపకులు హరిబాబు, కోచ్ పృథ్వీరాజ్, వీరప్ప పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరచిన క్రీడాకారులు

ధర్మవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన రూరల్ కబడ్డీ లీగ్ పోటీల్లో ధర్మవరం క్రీడాకారులు ప్రతిభ చాటారు. సెంట్రల్ జోన్ లీగ్ పోటీల్లో ధర్మవరం బాలుర జట్టు తాడిపత్రి, బత్తలపల్లి, కణేకల్, ఆత్మకూరు జట్లతో తలపడి వరుస విజయాలు సాధించారు. అలాగే బాలికల జట్టు ఆత్మకూరు, అనంతపురం జట్లపై విజయం సాధించారు. ఈ క్రీడాకారులను ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు పృథ్వీ, అనిల్, రాజశేఖర్ అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విజేతలతో సభ్యులు

కొత్తచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో కౌశల్ పోటీలు, స్కూల్ ఆఫ్‌ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ పోటీలు సోమవారం విజయవాడలో జరిగాయి. ఈ పోటీలకు జిల్లాకు చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1500, ద్వితీయస్థానంలో నిలిచిన ఆరుగురుకి రూ.1000 చొప్పున నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసినట్టు జిల్లా సైన్స్ విభాగపు అధికారి తనోజ్‌కుమార్ తెలిపారు.

కూచిపూడిలో రాణించిన రామలాలిత్య



ధర్మవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో ఆదివారం జరిగిన కూచిపూడి పతాక స్వర్ణోత్సవాల్లో ధర్మవరానికి చెందిన కళాకారిణి రామలాలిత్య ప్రతిభ కనబ రచినట్టు లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ తెలిపారు. ఈ పతాక స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వ హించిన మహా బృంద నాట్యంలో రెండు వేల మంది పాల్గొన్నా రని, రామలాలిత్య కూచిపూడిలో ప్రతిభ చాటి హెరిటేజ్ ఆర్ట్స్ వారి నుంచి జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకొందని తెలిపారు.

బడికి భద్రత కరువు

ప్రహరీ లేక.. జూదరులకు నిలయమైన వైనం

గాండ్లపెంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు భద్రత కరువైంది. పాఠశాల దాదాపు ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పాఠశాల చుట్టూ నివాస గృహాలున్నాయి. అలాగే తూపల్లి రోడ్డు, కదిరి, రాయచోటి ప్రధాన రహదారి ఉంది. నివాస గృహాలవారు పాఠశాల ఆవరణం నుంచే రహదారులు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల చుట్టూ నాటి ఉన్న నిలువ రాతి బండలను తొలగించి పాఠశాల ఆవరణం నుంచి ప్రధాన రహదారిలోకి దారులు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల ఆవరణం నుంచే పశువులనూ తొలుకెళ్తున్నారు. గత వైసీపీ పాలనలో పాఠశాల ఆవరణలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ప్రహరీని తొలగించారు. పక్కనే ఎమ్మార్సీ భవనం ఉంది. ఎమ్మార్సీలో విలువైన రికార్డులు, సర్వీస్ రిజిష్టర్లు ఉన్నాయి. పాఠశాలల ఆవరణంలో పలు పాత భవనాలున్నాయి. ఇవన్నీ మందు బాబులకు, జూదర్లకు నిలయంగా మారాయి. రాత్రి సమయంలో ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకుంది. విలువైన విద్యా సామగ్రి, రికార్డులకు భద్రత కరువైంది. ఆకతాయిలకు రాత్రివేళ ఈ పాఠశాలే నిలయంగా మారింది. అధికారులు, నాయకులు స్పందించి పాఠశాలకు ప్రహరీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ప్రహరీ నిర్మా ణానికి ప్రణాళికలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణానికి పనులు చేపడతామని అన్నారు.



తొలగించిన పాఠశాల ప్రహరీ



నిలువురాతి బండలను తొలగించిన దృశ్యం

కోవెలమూడి నారాయణరావు సేవలు ఎనలేనివి





కోవెలమూడి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

పుట్టపర్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సత్య సాయిబాబా సేవాసంస్థల ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కోవెలమూడి నారాయణరావు చేసిన సేవలు ఎనలేనివని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాల టీడీపీ నేతలు కొనియాడారు. ఉమ్మడి జిల్లాల టీడీపీ జోనల్ కమిటీ అధ్యక్షుడు కోవెలమూడి రవీంద్ర తండ్రి, శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కోవెలమూడి నారాయణరావు సంస్మరణ సభ పుట్టపర్తిలో పెద్ద వెంటకమరాజు కళ్యాణ మండలంలో సోమవారం నిర్వహించారు. ఈ సభకు మంత్రి, ప్రభుత్వ విప్‌తోపాటు ఎంపీ బీకే పార్థసారథి, రాప్తాడు, కదిరి, మడకశిర, గుంటూరు ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్‌రాజు, గల్లా మాధవి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఉమ్మడి జిల్లాల టీడీపీ అధ్యక్షులు వడ్డె అంజినప్ప, వెంటకశివుడు యాదవ్ హాజర య్యారు. కోవెలమూడి నారాయణరావు చిత్రప టానికి నివాళులర్పించారు. నివాళ్లులర్పించిన వారిలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ నేతలు ముట్టిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, విజయ్‌కుమార్, సుబ్రమణ్యం, సాముకోటి ఆదినారాయణ, సిమెంట్ పోలన్న, వడ్డె వెంకట్‌లతోపాటు ఉమ్మడి జిల్లాలో టీడీపీ నేతలు ఉన్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ

తప్పు చేస్తే కఠిన చర్యలు
ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనధికార లేఅవుట్లు రెగ్యులరైజ్ చేసుకోవడానికి అనుమ తులిస్తున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమ వారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, సబ్ రిజిష్టర్ శ్రీనివాసులతో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ఇచ్చే రెండు, మూడు నెలలోపు వీటిని రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వేసే కొత్త లేఅవుట్లకు మున్సిపాలిటీ అనుమతులు పొందిన తరువాతే ప్రజలు కూడా ప్లాట్లు కొను గోలు చేయాలన్నారు. ప్రతిఒకరు మున్సిపల్ నిబంధనలు పాటించి ప్లాట్లు కొను గోలు చేయాలన్నారు. అనధికార లేఅవుట్లలో ప్రభుత్వ స్థలాలు ఉంటే, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసు కుంటుందన్నారు. రాజకీయ ముసుగులో కొంత మంది ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి లేఅవుట్లు వేయడం, పేదలకిచ్చిన పట్టాలు అమ్ముకోవడం లాంటివి చేశారని, వీటిని సహించ బోమని అన్నారు. సామాన్యులు అవినీతిపై ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నెంబరు, ఈమెయిల్ ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్లను ఆక్రమిస్తే నోటీసులు లేకుండానే తొలగిస్తామని హెచ్చరించారు. చర్చి ఆస్తుల కుంభకోణం కదిరి నుంచి ప్రారంభమై కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చేరిందని, ఈ కుంభకోణానికి ఆద్యులను బయట పెడతా మని అన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ... పట్టణంలో 28 అనధి కార లేవుట్లను గుర్తించామన్నారు. వీటిలో ప్లాట్లు కొను గోలు చేసినవారు రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశమిస్తున్నామన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ఘనంగా అమావాస్య పూజలు

ధర్మవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెండేయస్వామి ఆలయంలో మార్గశిర మాసం సోమవారం సాయంత్రం మహాలక్ష్మీ అమ్మవారికి అమావాస్య పూజలు అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి, పద్మశాలియ బహూత్తమ సంఘం అధ్యక్షుడు పుత్తారుద్రయ్య, ఉపాధ్యక్షుడు జింకా నాగభూషణం, ప్రధాన కార్యదర్శి మెడికల బాలకుళ్లాయప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాయి శతామృతం



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థులు చేపట్టిన సాయి శతామృతం సంగీత గాన కచేరీ భక్తులను అలరింపచేసింది. సోమవారం సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో సంగీత కళాశాల విద్యార్థులు సంగీత గాన కచేరి నిర్వహించారు. గంటపాటు మధురమైన సంగీత గానంతో భక్తులను అలరింపచేశారు.

టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్

తనకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ సర్పంచ్ శారదమ్మ, కుమారులు మనోజ్ కుమార్, గిరీష్ సోమవారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

తక్కువ ధరకు వస్తువుల పేరుతో మోసం.. వ్యక్తి అరెస్టు

కల్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తన భార్యకు ఆరోగ్యం సరిగా లేదని, ఫ్రిజ్, స్కూటర్, ఏసీ మిషన్ తక్కువ ధరకు ఇస్తానని ఓ మహిళతో పాటు వ్యాపారిని మోసగించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లెకు చెందిన రమేష్(37) ఏడేళ్లుగా భార్యాబిడ్డలకు దూరమయ్యాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బు సంపాదించేందుకు వంచన మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈనెల 17న కల్లూరులో పాల వ్యాపారం చేసుకుంటున్న అరుణను రమేష్ టార్గెట్ చేశాడు. తన పేరు సుధాకర్ అని చెప్పుకుని కల్లూరు సమీపంలోని చల్లావారిపల్లెకుచెందిన వాడిగా పరిచయం చేసుకున్నాడు. తన భార్య అనారోగ్యంతో ఉందని, ఆపరేషన్ చేయాలని నమ్మించి ఆమె వద్ద రూ.1.50 లక్షల నగదు తీసుకెళ్లాడు. అంతటితో ఆగకుండా ఈనెల 20న ఫోన్‌లో తన పేరు రాజుగా పరిచయం చేసుకుని స్కూటీ తక్కువ ధరకు ఇస్తానని నమ్మించి రూ.15వేలు క్యూఆర్ కోడ్‌కు వేయించుకుని, ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఈనెల 19వ తేదీన కల్లూరుకే చెందిన వ్యాపారి మహబూబ్‌బాషాకు ఫోన్ చేసి, పులిచెర్ల మండలంలోని కురవపల్లికి చెందిన సుధాకర్‌గా పరిచయం చేసుకున్నాడు. స్కూటీ, ఫ్రిజ్, ఏసీ మిషన్ తక్కువ ధరకు ఇస్తానని నమ్మించి రూ:48 వేలు క్యూఆర్ కోడ్‌కు వేసుకున్న రమేష్ ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఆ ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కల్లూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రమేష్‌ను అరెస్టు చేసి, రూ.1.40లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమష్టి కృషి వల్లే తగ్గిన నేరాలు



ప్రశంసా పత్రం అందుకొంటున్న ఎస్బీ సీఐ

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు అధికారుల సమష్టి కృషి వల్లే జిల్లాలో నేరాలు తగ్గాయని ఎస్పీ రత్న అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ పోలీసు అధికారులు, సీఐలతో నిర్వహించిన నెలవారి నేరసమీక్షలో ఎస్పీ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఇదే స్ఫూర్తితో 2025 సంవత్సరంలో కూడా పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. వివిధ కేసులకు సంబంధించి విశేష ప్రతిభ కనపరిచిన 35 మంది పోలీసు అధికారులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయ్‌కుమార్, శివన్నారాయణస్వామి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు పలువురు సీఐలు, ఎస్బీ ఎస్సై ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తనకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): తాము మూడు నెలలుగా తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను పరిష్క రించాలని స్థానిక పాతూరు గుట్టవద్ద మహిళలు ఖాళీ బిందెలతో సోమ వారం నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ, సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా వారు పట్టించు కోలేదన్నారు. మూడు రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కుక్కల బారి నుంచి కాపాడండి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజలను కుక్కల బారి నుంచి కాపాడాలని యువసైన్యం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ అనంతచారికి వినతిపత్రం అందచేశారు. యువసైన్యం నాయకుడు జహీర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు గౌస్‌లాజం, హరినాథ్‌బాబు మాట్లాడుతూ మండల కేంద్రంలో రెండేళ్ల నుంచి పందులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో నివాసముంటున్నవారు, హోటల్ నిర్వాహకులు మురికినీరు, చెత్తచెదారం రోడ్డుపై వేస్తున్నారన్నారు. దీంతో రోడ్లపైకి పందులు వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చాలామంది కుక్కల బారిన పడి వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారన్నారు. అధికారులు స్పందించి కుక్కలు, పందుల బారినుంచి ప్రజలను కాపాడాలన్నారు.

క్రైం న్యూస్..

డ్రిప్ పైపుల చోరీ

నల్లచెరువు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాయల వాండ్లపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే రైతు మస్తాన్‌కు చెందిన బోరు బావి వద్ద డ్రిప్ పైపులు ఆదివారం రాత్రి చోరీ అయ్యాయి. దేవరింటిపల్లికి చెందిన రైతులు రఘునాథ్‌రెడ్డి, త్రిలోక్‌నాథ్‌రెడ్డి డ్రిప్‌పైపులు చోరికి గురయ్యాయి. ఎస్ఐ మగ్బుల్‌బాషా కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థి ఆచూకీ తెలపండి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రోజుల క్రితం ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలులో ప్రయాణిస్తూ కనపడకుండా పోయిన ఇంటర్ విద్యార్థి మనోజ్ కుమార్ ఆచూకీ కనుగోనాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఎస్పీ వీరత్నను కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎస్పీతో భేటీ అయ్యారు. రామగిరి మండలం కుంటిమద్ది పంచాయతీలోని శ్రీహరిపురం కాలనీకి చెందిన 17 ఏళ్ల మనోజ్‌కుమార్ విజయవాడ కేంబ్రిడ్జి కళాశాలలో చదివేవాడని, ఈనెల 26 నుంచి కనిపించకుండా పోయాడని, ఈఘటనపై సత్యన్నారాయణపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఇప్పటికి వరకు బాలుడి ఆచూకీ లభించలేదని ఎమ్మెల్యే తెలిపారు. ఈఘటనను సీరియస్‌గా తీసుకుని బాలుడి ఆచూకీ కనుగొనాలని ఎస్పీని కోరారు. ఆమె వెంట హిందూపురం పార్లమెంటు బీసీసెల్ అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య ఉన్నారు.

ఖాతాలో డబ్బు మాయం

గాండ్లపెంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మబూజాన్ బ్యాంక్ ఖాతాలో డబ్బులు మాయమయ్యాయని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ. తాను కూలి పనులు చేసుకుని గాండ్లపెంట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రూ.లక్ష దాచుకున్నానన్నారు. ఈనెల 28న తన ఫోన్‌కు సీఎస్‌సీ ఆయాప్ నుంచి ఒక లింక్ వచ్చిందని, ఆలింక్ ఓపన్ చేయగానే తన ఖాతా నుంచి మూడు మార్లుగా రూ.లక్ష ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిపారు. వీటిపై విచారణ చేసి, న్యాయం చేయాలని హెడ్‌కానిస్టేబుల్ రామమోహన్‌ను కోరారు.

జూదరుల అరెస్టు

ధర్మవరంరూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల గ్రామసమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.15,200 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బాస్కెట్‌బాల్ సంఘం సెక్రెటరీగా శెట్టిపి



ధర్మవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా సెక్రటరీగా ధర్మవరానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ సమావేశంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి సమక్షంలో ఈ ఎంపిక జరిగింది.

పోలీసులపై కేసు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేందర్‌రెడ్డి

కదిరిలీగల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం న్యాయవాది వీవీ శేషాద్రి మరణానికి కారుకులైన పోలీసులపై వెంటనే కేసులు నమోదు చేయాలని న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగేందర్‌రెడ్డి, సురేంద్రచౌదరి డిమాండ్ చేశారు. స్థానిక న్యాయవాదుల సంఘం కార్యాలయంలో సోమవారం ఆ సంఘ సభ్యులు సమావేశమయ్యారు. శేషాద్రిది ముమ్మాటికి పోలీస్ హత్యేనని సంఘం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అదేవిధంగా గాలివీడులో పోలీసులు మాజీ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డిపై దాడిని కూడా ఖండించారు. రెండు రోజుల పాటు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు.

నీటి ఎద్దడి రానివ్వకండి

గాండ్లపెంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో తాగునీటికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డికి సీపీఐ కార్యదర్శి సోమవారం వినతి పత్రం అందచేశారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే హంద్రీనీవా కాలువ రప్పిస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఎలాంటి ఆచరణ చేయలేదని అన్నారు. వెంటనే హంద్రీనీవా కాలువ ద్వారా మండలానికి నీరు తెప్పించాలన్నారు. స్పందించిన ఎంపీడీఓ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేస్తామన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు సమస్యలు పరిష్కరించాలని హిందూపురం నియోజకవర్గం పరిగి మండలానికి చెందిన యువ రైతు నవీన్‌కుమార్ కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కోరారు. రైతు సమస్యలు పరిష్కరించాలని నవీన్ ఎద్దుల బండిపై నవంబరు 17న యాత్ర ప్రారంభించి.. డిసెంబరు 14న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో కలిశారు. తిరుగు ప్రయాణంలో ఆయన సోమవారం పుట్టపర్తి చేరుకున్నారు. ఆయన యాత్ర 43వ రోజుకు చేరుకుంది. పుట్టపర్తిలో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ముదిగుబ్బ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. కస్తూర్బా కాలనీలో ప్రతి ఇంటికి డోర్ నెంబర్లు ఏర్పాటు చేసి వాటిని పంచాయతీ రికార్డుల్లో నమోదు చేయాలని, ప్రతి ఇంటికి సత్యసాయి తాగునీటిని సరఫరా చేయాలని, వీధిలైట్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటోపెద్దన్న, నాయకులు మండల వెంకటేష్, అవాజ్ కమిటీ సభ్యులు బాబ్జాన్, రహీం, ముస్తాఫా, నౌషాద్ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నల్లమాడ : మండలంలో మంగళారం పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాబర్టు విల్సన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7,077 మంది పింఛన్ దారులకు రూ. 3,07,20,500 పంపిణీ చేస్తామన్నారు.

అంతా ఇన్‌చార్జుల మయం..!

● ఒత్తిళ్లకు భయపడుతున్న అధికారులు ● సోమందేపల్లిలో గాడి తప్పిన పాలన



సోమందేపల్లిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు

సోమందేపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని నెలలుగా రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. ఏ అధికారి అయినా డెప్యుటేషన్ పై వచ్చినా పట్టుమని మూడు నెలలు ఉండటం లేదు. ఒత్తిళ్లు భరించలేక సెలవులు పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో పాలన గాడి తప్పుతోంది. ప్రజా సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. ప్రజలు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. గతంలో సోమందేపల్లి మండల కేంద్రంలో పనిచేయాలంటే ఎంతో ఆసక్తిచూపిన అధికారులు నేడు భయపడుతున్నారు. ఇక్కడ ఉద్యోగం కత్తిమీద సాములాంటిదని వాపోతున్నారు. రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకుల ఒత్తిళ్లు, కోర్టుకేసులు, సమాచార హక్కుచట్టం దరఖాస్తులు కారణంగా మారుతున్నాయి. ప్రతీది సమస్యగా మారుతుండడం తలనొప్పిగా తయారైందని పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఇరిగేషన్, పంచాయతీ ఔట్‌సోర్సింగ్ ఇన్చార్జీలే ఉన్నారు. ఎవరికి ఏమి చెప్పలేక ఒత్తిళ్లకు తాళ్లగలేక యాతన పడుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఉద్యోగులపై వేధింపులు తారస్థాయికి చేరాయి. తమను అడిగి ప్రతి పనిచేయాలని అప్పట్లో నాయకులు పెత్తనం చలాయించేవారు. అధికారిగా స్వేచ్ఛను కోల్పోయి నేతలు చెప్పిన పని చేయాల్సి ఉండేది. మరోవైపు ప్రజా సంఘాల నాయకుల పోరాటాలు అధికారులకు సవాల్‌గా మారాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులకు ఒత్తాసు పలుకుతున్నారని వేధింపులకు గురిచేస్తున్నారు. మరోపక్క తాము చెప్పినవారికే పనిచేయాలని ప్రస్తుత నాయకులు ఆదేశాలు జారీచేస్తున్నారన్నారు. దీంతో ఉద్యోగులు విధులు వీడి సెలవుల్లో వెళ్తున్నారు. ఈనెల మొదటివారంలో బ్రహ్మసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్ అమర్నాథ్ 2017లో మృతిచెందిన ఉపాధికూలీ మాల రామక్క పేరును మస్టర్లో నమోదుచేసి 17వారాలకు సంబంధించి సుమారు రూ.14వేలు స్వాహా చేసినట్లు డ్వామా అధికారులు విచారణలో గుర్తించారు. అతన్ని సస్పెండ్ చేశారు. అతను కోర్టుకు వెళ్లడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని తెలుస్తోంది. వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానిక నేతలు పై స్థాయి నుంచి తమపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఉద్యోగం భారంగా మారిందని వాపోతున్నారు. సెలవులపై వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఓ మండల స్థాయి అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక అధికార పార్టీ నేత ల కనుసన్నల్లో అక్రమ మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్కమ్మగార్ల కొండ వద్ద, సోమందేపల్లి రంగేపల్లి చెరువు, చెన్నాపురం గుట్టల్లో వందలాది ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. మట్టి తరలింపుపై అధికారుల తీరును తప్పుబడుతూ ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఇన్‌చార్జ్ అధికారికి తలనొప్పిగా మారింది. సోమందేపల్లి పట్టణ సమీపంలో 700 సర్వే నంబరులో ఉన్న 3.50 ఎకరాల్లో సుమారు 150 మంది పేదలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గతంలో గుడిసెలు వేసుకున్నారు. పక్కా ఇళ్ల నిర్మాణాలు సైతం చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్చార్జ్‌గా వచ్చిన మండల స్థాయి అధికారిణి పోలీసుల సహాయంతో వాటిని తొలగించారు. దీనిపై ప్రజా సంఘాలు హైకోర్టుకు వెళ్లాయి. అనంతరం వారు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో ఆ అధికారిణి బదిలీపై వెళ్లిపోయారు.

కూటమితోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ: మంత్రి



నాగలూరు వద్ద రోడ్డును చూపిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే రోడ్లకు మహర్దశ పట్టిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగలూరు గ్రామం చెరువుకట్ట నుంచి చెన్నాపురం రోడ్డు వరకు ఎన్ఆర్‌జీఎస్ నిధుల కింద రూ.75 లక్షలతో నిర్మిస్తున్న పనులను మంత్రి పరిశీలించారు. 30 ఏళ్లుగా రోడ్డు నిర్మాణ పనులు కాలేదని, ప్రస్తుతం ప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రొద్దం మండలంలోని నల్లూరు గ్రామం నుంచి దండేపల్లి క్రాస్ వరకు రూ1.18 కోట్లతో నిర్మించబోయే బీటీ రోడ్డును పరిశీలించారు. పెద్దగువ్వలపల్లి నుంచి చెరుకూరు గ్రామం వరకు రూ.75లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులను అధికారులతో మంత్రి సవిత పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ వెంకటరమణ, నాయకులు నారాయణస్వామి, మాధవనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టండి

పెనుకొండ టౌన్: విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమం రెసిడెన్సియల్ స్కూల్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవితకు పలు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ సమస్యలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ విద్యార్థుల చదువుపట్ల శ్రద్ధ చూపి ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు.

పశువైద్యశాల వద్ద రైతుల నిరసన



వానవోలు పశువైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గోరంట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామ పశువైద్యశాలలో మందులు లేకపోవడంతో చికిత్స కోసం తెచ్చిన పశువులతో సోమవారం రైతులు ఆందోళన చేశారు. సుధాకర్ అనే రైతు ఆవు గాయపడి నడవలేని స్థితిలో చికిత్స కోసం వానవోలు పశువైద్య కేంద్రానికి వచ్చారు. డాక్టర్ చంద్రశేఖర్ ఇంజక్షన్, మందులు బయట తీసుకురావాలని చీటి రాసి ఇచ్చారు. ఎప్పుడు వచ్చినా ఆసుపత్రిలో మందులు ఉండవని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మందులు లేనప్పుడు ఇంకెందుకు ఆసుపత్రి మూసివేయాలని తోటి రైతులతో కలిసి ఆందోళన చేస్తూ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ కోసం డాక్టర్ పోలీసులకు ఫోన్ చేయడంతో వా రు మరింత కోపోద్రిక్తులయ్యారు. చివరికి డాక్టర్ సొంత ఖర్చుతో బయట నుంచి ఇంజక్షన్ తెప్పించి ఆవుకు వేయడంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. ఈ విషయంపై డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో వానవోలు పశువైద్యశాల వార్షిక బడ్జెట్ రూ.2.50 లక్షలు ఉండేదన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు బడ్జెట్ మొత్తాన్ని రూ.45వేలకు కుదించిందని తెలిపారు. దీంతో ఆసుపత్రిలో అరకొర మందులతో ఆరునెలలుగా నెట్టుకొస్తున్నామని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితి చెబితే రైతులు అర్థం చేసుకోలేదని డాక్టర్ వాపోయారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : డీసీ



రికార్డులను పరిశీలిస్తున్న డీసీ నాగమద్దయ్య

పెనుకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, ఏఈఎస్ నరసింహతో పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మద్యం దుకాణదారులు ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీఐ సృజన్‌బాబు, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తికి అస్వస్థత

గోరంట్ల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగంపల్లికి చెందిన మల్లికార్జున పాముకాటుకు గురై సోమవారం అస్వస్థత పొందారు. కేశప్ప కుమారుడైన మల్లికార్జున ఇంటిలో వస్తువులను తీస్తుండగా అక్కడే ఉన్న పింజరి పాము ఎడమచేతి వేళ్లపై కాటు వేసింది. కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉషా చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం పుట్టపర్తి తరలించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



న్యాయాధికారికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

పెనుకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో న్యాయవాది శేషాద్రిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడంవల్లే గుండెపోటుతో మృతిచెందాడని, ఆయన మరణానికి కారణమైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ మేరకు సీనియర్ న్యాయాధికారి వాసుదేవన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పోలీసులు న్యాయవాదిని భయభ్రాంతులకు గురిచేయడం వల్లే గుండెపోటుతో మరణించాడని పేర్కొన్నారు. ఇటీవల అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన సీనియర్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిని పోలీసులు అవమాన కరంగా చొక్కా పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లారన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్‌సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాల్మీకి శ్రీనివాసులు, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, జావేద్, బాలాజీ, విక్రాంత్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై మహిళల ఆందోళన



వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

అమరాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన 17 సంఘాల్లో దాదాపు రూ.20లక్షలకు పైగా నిధులు గోల్‌మాల్ అయినట్లు ఆ గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు సోమవారం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గతంలో పనిచేసిన యానిమేటర్ శ్రీనిధి మహిళా సంఘాల ఖాతాలోని కుటుంబ సభ్యుల ఖాతాలకు, ఇతర ఖాతాలకు నిధులు మళ్లించి నగదును స్వాహా చేసినట్లు మహిళా సంఘాల సభ్యులు వాపోయారు. ఈ విషయాన్ని మడకశిర ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లడంతో అతడు వచ్చి వెలుగు సిబ్బంది మహిళా సంఘాల సభ్యుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పుట్టపర్తి నుంచి ఉన్నతాధికారులు వచ్చి ఎంతమేరకు నిధులు గోల్‌మాల్ అయ్యాయో విచారణ చేసి స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన తెలిపారు. ఏఎస్ఐ రామాంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌లు వచ్చి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి విచారణ పూర్తయ్యే వరకు యథావిధిగా సంఘాలు నడుపుకొంటూ అధికారులతో సహకరించాలని కోరడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన విరమించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు వద్దకు వెళ్లి తమప్రమేయం లేకుండా యానిమేటర్ నగదు డ్రా చేసుకోవడానికి వస్తే అలాంటి వారికి నగదు ఇవ్వడం కానీ, ఇతర ఖాతాలకు నగదు మళ్లించడం కానీ చేయకూడదని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సంక్షిప్తం

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మడకశిరటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీపీఐ నాయకులు పవిత్ర, సీపీఎం నాయకులు రామాంజనేయులు, పీడీఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు ఉమేష్ తదితరుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్కిల్ ఆవరణంలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వ్యాఖ్యలను అమిత్‌షా బేషరతుగా వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, మూర్తి, రాజ్యలక్ష్మి, ముత్యాలమ్మ, కన్యాకుమారి, అంజలి, రత్నమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మడకశిర రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. సోమవారం మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లతో కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంజువాణి మాట్లాడుతూ.. బాల్యవివాహాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాగి పంట లాభదాయకం

గుడిబండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో బోరుబావుల కింద రాగి పంట సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి వీరనరేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుణేమోరుబాగల్, తాళికెర పంచాయతీ గ్రామాల్లో రైతు సేవా కేంద్రం ఆవరణంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బోరు బావుల కింద ప్రత్యామ్నాయ పంటలైన రాగి పంటను సాగు చేయాలన్నారు. రైతులు పండించిన రాగులను ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా క్వింటాల్‌కు రూ.4,290కు కొనుగోలు చేస్తుందన్నారు. అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించి రాగి పంట సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు హేమలత, శారదమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

మడకశిరటౌన్/అగళి/రొళ్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఓటు హక్కు కల్గిన రైతులు తప్పనిసరిగా గ్రామ సచివాలయాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని మడకశిర, అగళి, రొళ్ల సీఈఓలు టి.సురేష్‌కుమార్, భోజన్న, ఎ.హనుమంతరాయ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సొసైటీలో ఓటు హక్కు కల్గిన రైతులందరూ ప్రభుత్వం అందించే వివిధ పథకాలకు సంబంధించి ఇన్‌పుట్‌సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ తదితర పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పాస్‌ఫొటో, ఫోన్ నంబర్, నామినీ ఆధార్ జిరాక్స్‌లు ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయం దగ్గర తప్పనిసరిగా తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

గంజాయిపై యువకులకు కౌన్సెలింగ్

సోమందేపల్లి , డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తుకు అలవాటుపడిన యువకులకు ఆదివారం రాత్రి ఎస్ఐ రమేష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్త వయసులో చెడు అలవాట్లకు బానిసలైతే జీవితాలు ఎలా నాశనం అవుతాయో, భవిష్యత్తు ఎలా మారుతుందో వివరించారు. తెలిసితెలియక గంజాయి మత్తుకు అలవాటుపడ్డారు. ఇకపై మత్తుకు దూరంగా ఉండాలన్నారు. అలవాటును మార్చుకోవాల్సిందేనని హెచ్చరించారు. లేనిపక్షంలో పట్టుబడితే ఊచలు లెక్కబెట్టాల్సి ఉంటుందని తెలిపారు. గంజాయికి సంబంధించి ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పరిగి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహేంద్ర(35) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న హైడేటి వైపు నుంచి పరిగికి ద్విచక్ర వాహనంలో వస్తున్న మహేంద్ర చిన్నపల్లి సమీపంలో మసాలా ఫ్యాక్టరీ వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఇతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో బెంగళూరు విక్టోరియ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

పొలంలోకి డ్రైనేజీ నీరు

పెనుకొండ టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ నీరు వస్తుండడంతో 50ఎకరాల పొలంలో వ్యవసాయం చేయలేకపోతున్నామని బాధిత రైతు అనిల్‌కుమార్ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. రైతు మాట్లాడుతూ.. పెనుకొండ మండలం మునిమడుగు పంచాయతీ సర్వేనంబరు 802-2ఎకు సంబంధించిన వ్యవసాయ పొలంలో గొల్లపల్లి డ్యామ్ లీకేజీ నీటితోపాటు కియా వేస్ట్‌వాటర్ తమ భూమిలోకి వస్తోందని పలుమార్లు అధికారులకు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. పొలంలోకి డ్రైనేజీ నీరు చేరడంతో వ్యవసాయం చేయలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కియా యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.

శిక్షణ తరగతుల పరిశీలన

పెనుకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకేషనల్ కోర్సుల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఓజేటీ (ఆన్ ది జాబ్ ట్రైనింగ్) జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్, శ్రీనివాసులు పరిశీలించారు. సోమవారం పెనుకొండకు వచ్చిన కమిటీ సభ్యులు కళాశాలలోని ఒకేషనల్ కోర్సులైన సిరికల్చర్, సీఎస్‌పీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులతో శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు తెలియజేశారు. శిక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వీరి వెంట సంబంధిత శాఖల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ సుదర్శన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

నవచండీయాగంలో ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఇంటి ఆవరణంలో గత మూడు రోజులుగా నవచండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఏడు కొండల స్వామి, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు నియోజకవర్గం ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, రాధాకృష్ణ, జయప్ప, ఉమేష్ కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, చంద్రప్ప పాల్గొన్నారు.

సేద్యం సినిమాకు అవార్డు



అవార్డు ప్రదానోత్సవంలో నిర్మాత సురేష్, దర్శకుడు చంద్రకాంత్

గోరంట్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతుల స్థితిగతుల గురించి రూపొందించిన 'సేద్యం' సినిమాకు ఉత్తమ అవార్డు లభించింది. గోరంట్లకు చెందిన నిర్మాత జీఎం సురేష్, దర్శకుడు చంద్రకాంత్ పసుపులేటి రూపొందించిన సేద్యం సినిమాకు బెంగుళూరులో ఆదివారం రాత్రి జరిగిన ఇంటర్‌నేషనల్ పనోరమా ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఉత్తమ అవార్డు అందుకున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చిత్రం జీఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్ యూట్యూబ్ చానల్‌లో ఆదరిస్తున్నవారికి నిర్మాత సురేష్ ధన్యావాదాలు తెలిపారు.

అయ్యప్ప ఆలయ ఆదాయం రూ.8.20 లక్షలు

గోరంట్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దామర ఒడ్డు అయ్యప్పస్వామి ఆలయ హుండీ ఆదాయం ఈ ఏడాది రూ.8.20 లక్షలు వచ్చినట్లు నిర్వాహకుడు వెంకటరెడ్డి తెలిపారు. మాల ధరించిన భక్తుల సమక్షంలో సోమవారం హుండీలోని మొత్తాన్ని లెక్కించగా రూ.1.20 లక్షలు వచ్చిందన్నారు. విరాళాల రూపంలో రూ. 7 లక్షలు దాతలు అందించారు. మొత్తం రూ.8.20లక్షలు కాగా, నిత్యాన్నదానం కోసం రూ.4లక్షలు ఖర్చు చేసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సేవామందిరం వార్షికోత్సవం

పరిగి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): లింగన్న పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సేవామందిరం 83వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు కేటీ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవామందిరంలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరినట్లు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధుడు ఎంఎం లింగన్న బలహీనవర్గాల అభ్యున్నతికి చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు జూనియర్ కళాశాల విద్యార్థులు



సెమీ ఫైనల్‌కు చేరిన క్రికెట్ జట్టు

పెనుకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొన్న పెనుకొండ జూనియర్ కళాశాల క్రికెట్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరిందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. సోమవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో అనంతపురం నలంద జూనియర్ కళాశాలపై పెనుకొండ విజయం సాధించిందని, మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాలపై విజయం సాధించి సెమీ ఫైనల్స్‌లో ప్రవేశించిందన్నారు. ప్రతిభ కనబరుస్తున్న క్రికెట్ జట్టును ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ పీఓ శుకర్‌నాయక్, అఫీజ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

శ్మశాన వాటిక కోసం స్థల పరిశీలన

గోరంట్ల, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టగుండ్లపల్లి ఎస్సీ కాలనీ వాసులకు శ్మశాన వాటిక కోసం తహసీల్దార్ మారుతి సోమవారం స్థల పరిశీలన చేశారు. గత కొంతకాలంగా పుట్టగుండ్లపల్లి ఎస్సీలు శ్మశానవాటిక సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, స్థలం చూపించాలని రెవెన్యూ అధికారులను, ప్రజాప్రతినిధులు కోరారు. మందపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 258లోని 75సెంట్ల స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. గ్రామ పెద్ద సమక్షంలో ఎస్సీలకు అనువైన స్థలంగా నిర్ణయించారు. దీంతో 75సెంట్లను ఎస్సీ శ్మశానవాటికకు కేటాయిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సుజాత, టీడీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వనకే ఓబవ్వ జయంతిని విజయవంతం చేయండి

గుడిబండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మడకశిరలో జనవరి 19న మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వీరవనిత వనకే ఓబవ్వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం తాలూకా అధ్యక్షుడు పాండురంగమూర్తి, కార్యదర్శి సోమ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మందలపల్లిలో మాలమహానాడు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరవనిత వనకే ఓబవ్వ జయంతికి పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బసవరాజు, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, మూర్తి, గోవిందరాజు, నాగరాజు, గంగాధర పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నీ

పెనుకొండ టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పుట్టిన రోజు సందర్భంగా మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు త్రివేంద్రనాయుడు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1నుంచి ఈ మెగా క్రికెట్ టోర్నీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,116, రన్నర్స్‌కు రూ.30,116 ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు.

నరేగా పనుల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ ప్రభు

పావగడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలు నిర్వహిస్తున్న నరేగా పనులను జిల్లా పంచాయతీ సీఎస్(చీఫ్ సెక్రెటరీ) ప్రభు సోమవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలకు బదులుగా ఎక్స్‌కవేటర్లతో పనులు చేస్తున్నారని తనకు వచ్చిన సమాచారం మేరకు ఆయన అధికారులతో చర్చించారు. చట్ట ప్రకారం ఉపాధి పనులు కూలీలతోనే చేయించాలని, పీడీఓలు గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించాలని తెలిపారు. జేజేఎం పథకం కింద భద్ర తాగునీరు తరలింపునకు పాత ట్యాంకులకే రంగులు వేసి బిల్లులు చేసుకొన్నారనే ఆరోపణపై కొన్నిగ్రామాలను ఆయన పరిశీలించారు. ఈఓ జానకిరామ్, తహసీల్దార్ వరదరాజు, అన్ని పంచాయతీ పీడీఓలు పాల్గొన్నారు.